సాక్షి
కామారెడ్డి
శనివారం, 10, ఫిబ్రవరి, 2024



వైభవంగా మాఘ అమావాస్య

మాఘ అమావాస్య సందర్భంగా జిల్లాలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు.

- 9లో ▸



రేషన్‌కార్డు ఉంటేనే..

తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకే 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.8 /15.0

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ వేడిమి పెరిగే అవకాశం ఉంది. రాత్రి చలి తీవ్రత తగ్గవచ్చు.

గృహజ్యోతికి కసరత్తు

- 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి లబ్ధి
- జిల్లాలో 2.30లక్షల గృహాలకు అమలయ్యే అవకాశం
- ఉచిత విద్యుత్‌తో ప్రతినెలా రూ. 7 కోట్లకు పైగా భారం
- వేగంగా సాగుతున్న వివరాల సేకరణ

గృహాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు అందించే గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు కరెంటు బిల్లు రీడింగ్ తీసే సమయంలో ప్రజల రేషన్, ఆధార్, ఫోన్ నంబర్ల సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ ఈ నెల 14 వరకు కొనసాగనుంది.



జిల్లాలో కొనసాగుతున్న సర్వేను పరిశీలిస్తున్న ఎస్ఈ రమేశ్‌బాబు

కామారెడ్డి టౌన్: జిల్లాలో మొత్తం 9 కేటగిరిల్లో 4,22,497 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతినెలా 11.50 కోట్ల ఆదాయం సమకూరుతుంది. జిల్లాలో కేటగిరి–1లోనే 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారు 95శాతానికి పైగా ఉన్నారు. కేటగిరి–1లో జిల్లాలో 2,69,177 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 2,30,328 కనెక్షన్లలో ప్రతినెలా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికారుల లెక్కల్లో తేలింది. దీంతో వీరందరికీ గృహజ్యోతి పథకం అమలయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వానికి, విద్యుత్‌శాఖకు ప్రతినెలా రూ. 7 కోట్లకు పైగానే భారం పడనుంది. అద్దెకు ఉంటున్న వారికి కూడా రేషన్(ఆహార భద్రత కార్డు), ఆధార్ వివరాలు నమోదు చేసిన వారికి కూడా ఉచిత విద్యుత్తు అందించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఇంకా పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాకపోవడంలో అద్దెకున్న వారికి వర్తిస్తుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డు లేని వారు కూడా 200 యూనిట్లు వినియోగిస్తున్న వారు జిల్లాలో అధిక సంఖ్యలోనే ఉండగా వారికి కూడా ఈ గృహజ్యోతి పథకం వర్తిస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో కేటగిరీల వారీగా కనెక్షన్లు..

కేటగిరి-1	2,69,177	కేటగిరి-6	6,698
కేటగిరి-2	32,487	కేటగిరి-7	1,876
కేటగిరి-3	2,659	కేటగిరి-8	109
కేటగిరి-4	484	కేటగిరి-9	03
కేటగిరి-5	1,09,004	మొత్తం	4,22,497

కేటగిరి-1లోనే కాకుండా ఇతర కేటగిరీలో సైతం 200 యూనిట్లు వినియోగించే వారు కూడా ఉంటారని అధికారులు పేర్కొన్నారు.

200 యూనిట్లలోపు వాడే వారి వివరాలు

యూనిట్లు	కనెక్షన్లు	యూనిట్లు	కనెక్షన్లు
0- 50	1,22,333	101-150	26,609
51-100	72,411	151-200	8,975
		మొత్తం	2,30,328

వివరాలు ఇవ్వాలి

ప్రజాపాలనలో సమర్పించిన గృహజ్యోతి పథకం దరఖాస్తుల సమాచార ధృవీకరణ కోసం విద్యుత్ శాఖ సిబ్బంది జిల్లాలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. ఇందుకు కావాల్సిన వివరాలను దరఖాస్తుదారులు అందించి సహకరించాలి. ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆహార భద్రత, ఆధార్ కార్డు నంబర్ల వివరాలను అందుబాటులో ఉంచుకుని సిబ్బందికి ఇవ్వాలి. సిబ్బంది వచ్చే సమయంలో ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే ఆ వివరాలను నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చి ఇవ్వొచ్చు.

– రమేశ్‌బాబు, ఎస్ఈ, విద్యుత్ శాఖ, కామారెడ్డి

పిల్లల 'కిడ్నాప్' పుకార్లు!

- సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- వణికిపోతున్న తల్లిదండ్రులు
- పల్లె, పట్నం అంతటా అదే పరిస్థితి
- కొత్తవాళ్లు కనబడితే అనుమానిస్తున్న జనం

సాక్షి, కామారెడ్డి: పిల్లల కిడ్నాప్ ముఠాలు తిరుగుతున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం జనానికి కునుకు లేకుండా చేస్తోంది. చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని, ఫలానా ఊళ్లో ఎత్తుకెళ్లారని, ఇంకో ఊళ్లో కిడ్నాపర్లను ప్రజలు పట్టుకున్నారని.. ఇలా ఏదో ఒక వీడియోను సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో అంతటా కిడ్నాప్ ఫోబియా పట్టుకుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ముఠాలు తిరుగుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. బాన్సువాడలో ఐదారేళ్ల క్రితం జరిగిన ఓ కిడ్నాప్‌కు సంబంధించిన వీడియోను తాజాగా కొందరు సోషల్ మీడియాలో చేయడంతో జనం ఆందోళనకు గురయ్యారు. అది పాత వీడియో అని పోలీసులు వివరణ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఇక్కడ వైరల్ చేస్తున్నారు. ఎప్పుడో, ఎక్కడో జరిగిన వాటిని తాజాగా జరిగినట్లు చూపే ప్రయత్నం చేస్తుండడంతో అంతటా ఆందోళన నెలకొంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ప్రతిచోటా పిల్లల కిడ్నాపుల గురించి చర్చ జరుగుతోంది.

ఇంటికి చేరేవరకు ఆందోళనే

స్కూల్‌కు వెళ్లిన పిల్లలు తిరిగి ఇంటికి చేరేదాకా తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. కొందరయితే స్కూళ్లకు వెళ్లి ఎవరైనా వస్తే తమ పిల్లల్ని వారితో పంపవద్దని చెబుతున్నారు. ఇంకొందరు తల్లిదండ్రులు చదువుపోయినా సరే అంటూ ఇంటి వద్దే ఉంచుతున్నారు. పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న వేళ కిడ్నాపుల ప్రచారం పిల్లల చదువులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కిడ్నాపులంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీంతో పిల్లలు కాసేపు కనిపించకపోయినా తల్లిదండ్రులు అనుమానించే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కాలంలో జిల్లాలో కిడ్నాపులు జరిగినట్లు ఎక్కడా కేసులు నమోదు కాలేదు. కానీ సామాజిక మాధ్యమాల్లో ఫలానా ఊళ్లో కిడ్నాప్ జరిగిందటూ రోజుకో ప్రాంతంపై ప్రచారం చేస్తున్నారు. ఇది మరింత ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని వీడియోలు చూస్తుంటే అవి ఇతర రాష్ట్రాలకు చెందినవి ఉంటున్నాయి. అయినా జనం మా ఊళ్లో, పక్క ఊళ్లో పిల్లలు కిడ్నాప్ అయ్యారంటూ బంధువులకు ఫోన్లు చేసి చెబుతుండడంతో నిజమే అని నమ్మే పరిస్థితి ఏర్పడింది.

కొత్తవారొస్తే..!

పట్టణాలతో పాటు పల్లెల్లో కొత్త వ్యక్తులు కనబడితే, ఇతర ప్రాంతాల రిజిస్ట్రేషన్లు కలిగిన కార్లు కనబడితే చాలు కిడ్నాపర్లే అని భావిస్తున్నారు. ఎవరో ఒకరు వారిని చూసి సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేయడంతో క్షణాల్లో జనం పోగై కొత్తగా కనబడుతున్న వ్యక్తులను నిలదీస్తున్నారు. వారిపై దాడికి సైతం వెనకాడడం లేదు. ఇటీవల కాలంలో జిల్లాలో ఎక్కడా కిడ్నాపులు జరగలేదని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని పోలీసు అధికారులు కొట్టిపారేస్తున్నారు. ఏది ఏమైనా నిజానిజాలు తెలుసుకోకుండా అందరూ పుకార్లను నమ్ముతూ వాటిని షేర్ చేయడం ఇబ్బందికరంగా తయారైంది.

న్యూస్‌రీల్

రేపు గురుకులాల ప్రవేశ పరీక్ష



కామారెడ్డి క్రైం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష ఉంటుందన్నారు. ఇందుకోసం జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 3,986 మంది విద్యా ర్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు నరసింహారెడ్డి, రాధిక రెడ్డి, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు సీఈవో సాయాగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి చైర్‌పర్సన్ డి.శోభ అధ్యక్షతన వహించనున్నారన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం కింద నిధులతో చేపట్టే వివిధ పనులకు ఆర్థిక ప్రణాళిక రూపొందించి ఆమోదించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన పోలీసులు



పిట్లం(జుక్కల్): పిట్లంలో ఉరేసుకున్న ఓ వ్యక్తికి పోలీసులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన దండు లక్ష్మణ్ భార్యతో గొడవపడి, ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకొని ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే హెడ్‌కానిస్టేబుల్ సాయగౌడ్, కానిస్టేబుల్ బుచ్చయ్యలు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో తలుపులను పగులగొట్టి లోపలికి వెళ్లి లక్ష్మణ్‌ను కిందికి దించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడికి సీపీఆర్ చేశారు. అనంతరం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాన్సువాడలో చికిత్స పొందుతున్న దండు లక్ష్మణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



నాగన్నగారి మెట్ల బావిలో మట్టి తట్టలు మోస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పలుగుతో పూడిక మట్టిని తవ్వారు. కూలీలతో పాటు మట్టి తట్టలు మోశారు. అనంతం ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయలకు ఎంతో విశిష్టత ఉందన్నారు. పూర్వకాలంలో ఎంతో ముందుచూపుతో మోటబావులు, మెట్ల బావులు చెక్కుచెదరని విధంగా నిర్మించారని పేర్కొన్నారు. కట్టడాలను, బావులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వాటి పునరుద్ధరణ వల్ల బావితరాలకు పురాతన కట్టడాల ప్రాముఖ్యతను తెలపవచ్చన్నారు. పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతాయని పేర్కొన్నారు. భిక్కనూరు సిద్ధిరామేశ్వర ప్రాంగణంలోని కోనేరును దాతల సహకారంతో పునరుద్ధరించినట్లు తెలిపారు. లింగంపేటలోని నాగన్నగారి బావి పునరుద్ధరణ పనులు సైతం కొద్ది రోజులుగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వాటర్‌డేలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ గరీబున్నిసాబేగం, ఎంపీవో ప్రభాకరచారి, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సీఎంఆర్ గడువు పెంపు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 28,146 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించడానికి ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. అవకాశాన్ని రైస్‌మిల్లర్లు ఉపయోగించుకొని వందశాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. సీఎంఆర్ పెండింగ్ ఉన్న 26 రైస్ మిల్లుల యజమానులు, అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 91శాతం సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించామన్నారు. మరో తొమ్మిది శాతాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయడానికి మిల్లర్లు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ నెల 15న మరోసారి పురోగతిని తిరిగి సమీక్షిస్తానని తెలిపారు. లక్ష్యం దిశగా మిల్లింగ్ చేపట్టని మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. జాప్యంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

డెంగీనా.. వైరల్ ఫీవరా!

- కొమలంచలో కొనసాగుతున్న వైద్య శిబిరం
- 'సాక్షి' కథనంపై రాష్ట్ర అధికారుల స్పందన



కొమలంచ సబ్‌సెంటర్‌కు వచ్చిన రోగులు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): కొమలంచలో విషజ్వరాలు ప్రబలడానికి గల కారణాలు వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులకు అంతుచిక్కడం లేదు. జ్వరాల బాధితులు వైద్యశిబిరానికి తరలివస్తుండడంతో చికిత్సలు చేస్తున్నారు. కొందరు విద్యార్థుల్లో రక్తకణాలు తగ్గుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బండగల్లి, కుర్మ గల్లిలో వస్తున్న జ్వరాలు డెంగీనా లేక వైరల్ ఫీవర్ల అనే విషయాన్ని వైద్య శాఖ అధికారులు నిర్ధారించలేకపోతున్నారు. శుక్రవారం కొమలంచలో వైద్యులు రోహిత్, ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో అబ్బాగౌడ్, మిషన్ భగీరథ ఏఈఈ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగారు. ఆయా కాలనీలకు తాగు నీరందించే రక్షిత ట్యాంకు నీటిని ల్యాబ్‌కు పంపించారు. నీరు కలుషితం కాలేదని ల్యాబ్ రిపోర్టులు వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అయితే బండగల్లికి చెందిన ఓ విద్యార్థి బీర్కూర్‌ని మహాత్మా జ్యోతిబా పూలే వసతి గృహం నుంచి జ్వరంతో ఇంటికి వచ్చాడు. సదరు విద్యార్థికి తీవ్ర మైన జ్వరం ఉండడంతో ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులకు జ్వరాలు సోకాయని కాలనీ ప్రజలు, వైద్యులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రక్తకణాలు పడిపోతుండడంతో డెంగీ ప్రభావం అయ్యి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఫాగింగ్ చేయించారు.

నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

కొమలంచలో విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' మెయిన్ పేజీలో వచ్చిన కథనానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రభుత్వ అధికారులు స్పందించారు. అంతుచిక్కని జ్వరాల బారిన పడిన రోగులు, వారికి అందిస్తున్న వైద్య సదుపాయం, జ్వరాలకు గల కారణాలు సమర్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, మండల వైద్యుడు రోహిత్, ఎంపీడీవో నాగేశ్వర్‌ను ఆదేశించారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాస నోటీసులు



ఆర్డీవోకు నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావుపై ఏడుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం నోటీసును కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాసరెడ్డికి శుక్రవారం అందజేశారు. మండల పరిషత్‌కు వచ్చిన నిధుల గురించి ఎంపీటీసీలకు తెలపకపోవడం, ఏకపక్షంగా వ్యవహరించడంతోనే అవిశ్వాస నోటీసులిచ్చినట్లు ఎంపీటీసీలు తెలిపారు. గతంలోనూ అవిశ్వాస తీర్మానానికి ప్రయత్నించినా అప్పటి కామారెడ్డి ఎమ్మెల్యే గంపగోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ చొరవతో వెనక్కి తగ్గారు. కాగా ప్రస్తుతం ఇచ్చిన అవిశ్వాస నోటీసులను ఆర్డీవో ధృవీకరించారు.

ఖరీదైన బైకులే టార్గెట్..

బైక్‌ల చోరీ ముఠా అరెస్ట్

- 29 వాహనాలు స్వాధీనం
- వాటిలో 12 బుల్లెట్ బైకులు, 12 పల్సర్‌లు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధు శర్మ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం : చేసే దొంగతనం ఎలాగూ చేస్తున్నాం.. తక్కువ డబ్బులు వచ్చే వాటిని ఎందుకు చేయాలి అనుకున్నారో ఏమో.. ఏకంగా బుల్లెట్, పల్సర్ లాంటి బైకులపై కన్నేశారు. 29 బైకులను చోరీ చేసి చివరికి పోలీసులకు చిక్కారు. ఖరీదైన బైకులను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధు శర్మ వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో తరచుగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇటీవల పట్టణంలోని ఓ వ్యక్తికి చెందిన బుల్లెట్ బైక్ చోరీ కావడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. నిందుతులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీలు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విచారణ చేపట్టారు. శుక్రవారం నిజాంసాగర్ చౌరస్తాలో ఓ బైక్‌పై ముగ్గురు యువకులు వెళ్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అడ్డుకుని విచారించారు. తామే బైక్ చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. నిందితులను నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం బొంకన్‌పల్లికి చెందిన నిజాంపూర్ శశాంక్, ఏర్గట్ల సందీప్, షేక్ అహ్మద్‌లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి మొత్తం 29 బైకులను రికవరీ చేశారు. వాటిలో 12 బుల్లెట్‌లు, 12 పల్సర్ బైక్‌లే కావడం గమనార్హం. దొంగిలించిన బైక్‌లను నిజామాబాద్, నాందేడ్, తదితర ప్రాంతాల్లోని చిన్నచిన్న గ్రామాల్లో తెలిసిన వారికి విక్రయించినట్లు విచారణలో తేలింది. బైక్‌లకు సంబంధించి కామారెడ్డిలో 12, బాన్సువాడలో 4, నస్రుల్లాబాద్ పీఎస్‌లో ఒకటి, నిజామాబాద్ టౌన్‌లో 2, రూరల్‌లో 2, వేల్పూర్‌లో 2, మోర్తాడ్, ఇందల్‌వాయి, ఆర్మూర్, కమ్మర్‌పల్లి పీఎస్‌లలో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ సీఐలు మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్, ఎస్సై ఉస్మాన్, శ్రీరాం, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ప్రకాశ్, ఎస్బీ సీఐ జార్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి 2లక్షల 72వేల 582 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక



కామారెడ్డి టౌన్ : జాతీయ స్థాయి సౌత్ ఇండియా సైన్స్ ప్రదర్శనకు ఉప్పలవాయి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి నేనావత్ బబ్లూ ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో బబ్లూ రూపొందించి ప్రదర్శించిన ఇంటలిజెంట్ హెల్మెట్ సిస్టం అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు గైడ్ టీచర్ వాసు శుక్రవారం తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చాటాలని విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

వివాదాస్పద స్థలంపై విచారణ

రాజంపేట : మండల కేంద్రంలోని సర్వేనం. 637లో 14 గుంటల కబ్జాకు గురైందని ఇటీవల బీజేపీ నాయకుల ఫిర్యాదు కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. గతంలో జూకంటి వంశస్తులు సర్వే నం. 637లోని కొంత భూభాగాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి దానంగా ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఆనుకొని ఉన్న సుమారు 14 గుంటల భూమి కబ్జాకు గురైందని స్థానిక బీజేపీ నాయకులు స్థానిక జీపీ, మండల కార్యాలయాల్లో ఫిర్యాదు చేయగా ఆ స్థలాన్ని ఎంపీవో విచారణ చేపట్టారు. ఎంపీవో విచారణలో సరైన న్యాయం జరగలేదని సంబంధిత భూయజమాని డీపీవోను సంప్రదించారు. దీంతో డీపీవో శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం వివాదాస్పద స్థలంపై విచారణ జరిపినట్లు డీఎల్‌పీవో సాయిబాబా తెలిపారు.

మొక్కజొన్న విత్తనాల్లో నాణ్యతాలోపం

- 50 ఎకరాల్లో ఎండిపోతున్న మొక్కలు
- ఆందోళనలో రైతులు
- చేతులెత్తేసిన వ్యవసాయ అధికారులు



ఎండిపోయిన మొక్క జొన్న పంట

బిచ్కుంద(జుక్కల్) : మార్కెట్‌లో నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు, ఎన్ని నిబంధనలు పెట్టిన ప్రయోజనం లేకుండా పోతుంది. దుకాణాల్లో తనిఖీలు చేయాలని పోలీసు, వ్యవసాయ రెండు శాఖల అధికారుల సమన్వయంతో టాస్క్‌ఫోర్సు బృందాలు నియమించి దుకాణాలపై దాడులు చేసిన నకిలీ విత్తనాలు మార్కెట్‌లో చెలామణి అవుతునే ఉన్నాయి. మండలంలో పుల్కల్ గ్రామానికి చెందిన 30 మంది రైతులు రెండు నెలల క్రితం 50 ఎకరాలలో గంగా కావేరి కంపెనీకి చెందిన జీ.కే 3155 రకం మొక్కజొన్న విత్తనాలు వేశామని, కాని నాణ్యత లేని నకిలీ విత్తనాలతో మొక్కలు ఎర్రగా మారి ఎండిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. నాణ్యత లేకపోవడంతో మొక్క కాండం నుంచే ఆకులు, పాల దశలో ఉన్న కంకులు పూర్తిగా మాడిపోయాయని రైతులు కంటితడి పెట్టుకుంటున్నారు. బిచ్కుంద, పెద్దకొడప్‌గల్‌లో ఉన్న విత్తనాల దుకాణం నుంచి మొక్కజొన్న విత్తనాలను రైతులు తీసుకొచ్చారు. మంచి విత్తనాలు ఉన్నాయని దుకాణదారులు నమ్మించి రైతులకు అంటగట్టారు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసిన భూమిలో పోషకాల లోపం ఉందని చెప్పి అధికారులు దుకాణ యజమానులకే వత్తాసు పలుకుతున్నారని రైతులు అంటున్నారు. ఇతర కంపెనీ విత్తనాల పంటలు బాగున్నాయని, 50 ఎకరాలు జీ.కే 3155 రకం విత్తనాలు వేసిన రైతులకే ఈ సమస్య ఉందని చెప్పినా తమకేమి తెలియదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పెట్టుబడి కోసం ఎకరాకు రూ. 20 వేలు ఖర్చయిందని వారు వాపోతున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి కంపెని ప్రతినిధులతో మాట్లాడి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పొంతనలేని సమాధానాలు

రైతులు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి ఎండిపోయిన మక్క పంట గోడును వినిపించారు వెంటనే స్పందించిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పంటక్షేత్రాలను సందర్శించి ఎండిన మొక్కజొన్న పరిశీలించారు. ఎక్కడ లోపం ఉందో తెలియక నామ మాత్రంగా పరిశీలించి పొంతన లేని సమాధానం చెప్పి వెళ్లిపోయారని రైతులు అంటున్నారు.

నాణ్యత లేని విత్తనాలు



బిచ్కుంద, పెద్దకొడప్‌గల్‌లో ఉన్న విత్తన షాప్ నుంచి 30 మంది రైతులు విత్తనాలు తీసుకున్నాం. నకిలీ విత్తనాలు అంటగట్టారు. రెండు ఎకరాలు సాగు చేసిన ఎర్రగా మారి ఎండిపోయింది. పెట్టుబడి రాక రాని పరిస్థితి. దుకాణా యజమానులపై ఎమ్మెల్యే, కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

– పండరి, రైతు, పుల్కల్


చిట్టెడు గింజలు చేతికొచ్చేట్లు లేవు



గంగా కావేరి జీకే నంబర్ 3155 మొక్కజొన్న విత్తనాలు వేసి నష్టపోయాం. గింజలు పాల దశలో ఉన్నాయి. పంట పూర్తిగా ఎండిపోయింది. చిట్టెడు గింజలు చేతికి రాకుండా ఉంది. ఇతర కంపెనీ విత్తనాల పంటలు బాగున్నాయి. 3155 రకం విత్తనాలు నకిలీ ఉన్నాయి. వ్యవసాయ అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారు.

– హన్మాండ్లు, రైతు, పుల్కల్

ఎస్‌వో వేధింపులు భరించలేకపోతున్నా..





ఎస్‌వో వేధింపులకు గురిచేస్తున్నారంటూ పీఈటీ పెట్టిన వాట్సాప్ స్టేటస్

- మానసికంగా హింసిస్తున్నారని కేజీబీవీ పీఈటీ వాట్సాప్ స్టేటస్
- బీపీ ఎక్కువై ఆస్పత్రి పాలైన పీఈటీ
- ఆరోపణలు అవాస్తవమంటున్న ప్రిన్సిపాల్

దోమకొండ: ఎస్‌వో మేడం నన్ను బ్రతకనివ్వడం లేదు.. మానసికంగా హింసిస్తున్నారంటూ మండలంలోని సీతారాంపల్లి కేజీబీవీకి చెందిన కాంట్రాక్ట్ పీఈటీ వీణ వాట్సాప్ స్టేటస్ గురువారం కలకలం రేపింది. పీఈటీ వీణ తెలిపిన వివరాల ప్రకారం.. గత నాలుగేళ్లుగా కేజీబీవీలో కాంట్రాక్ట్ పీఈటీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం జరిగిన హోలీ వేడుకల్లో సిబ్బంది కోరిక మేరకు తాను కల్లు తీసుకొచ్చి వారికిచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా పిల్లలకు రాత్రి మిగిలిన అన్నం ఉదయం అందిస్తుండడంపై ప్రిన్సిపాల్ మమతను ప్రశ్నించడంతో తనపై కక్ష పెంచుకుందన్నారు. రెండేళ్ల నుంచి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నన్ను మానసిక క్షోభకు గురిచేస్తున్నట్లు తెలిపారు. కేజీబీవీలోని పిల్లలు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ఎవరితోనూ నాతో మాట్లాడనివ్వకుండా అడ్డు పడుతున్నారని పేర్కొన్నారు. వీరి వేధింపులు భరించలేక రెండు రోజుల క్రితం బీపీ ఎక్కువై మైండ్‌స్ట్రోక్ రావడంతో కామారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. తనకు ఏదైనా జరిగితే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కారణమని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా పీఈటీ వీణ కళాశాల ఆవరణలోకి కల్లు తెచ్చుకుని సేవిస్తుందన్నారు. ఈ విషయమై డీఈవో, ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. కల్లు సేవించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు ఆడపిల్లలపై ప్రభావం పడుతుందని జిల్లా అధికారులకు తెలిపినందుకు పీఈటీ తనపైనే కక్షగట్టి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ విషయమై బీబీపేట పీఎస్‌లో పీఈటీపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తెల్లకార్డు ఉంటేనే ఉచిత విద్యుత్



జెడ్పీ వైస్ చైర్మన్ అధ్యక్షతన జరుగుతున్న వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశం

- ముగిసిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కామారెడ్డి అర్బన్: తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబంలో ఒక ఇంటికి మాత్రమే నెలకు రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి ప్రక్రియ కొనసాగుతోందని విద్యుత్ అధికారి మల్లేశ్ తెలిపారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, వ్యవసాయానికి సంబంధించిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, వైస్ చైర్మన్ ప్రేంకుమార్, తాడ్వాయి జెడ్పీటీసీ సభ్యురాలు బత్తుల రమాదేవి, బాన్సువాడ జెడ్పీటీసీ సభ్యురాలు పద్మల అధ్యక్షతన జరిగాయి. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికే ఉచిత విద్యుత్ అందుతుందని జిల్లా అధికారి పేర్కొన్నారు. అలాగే విజయ డెయిరీకి పాలు పోసిన పాడిరైతులకు ఇవ్వాల్సిన లీటరుకు రూ. 4 ప్రోత్సాహకం చెల్లించడం లేదని దోమకొండ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్ల యూనిట్లకు డీడీలు చెల్లించిన వారికి వెంటనే మంజూరు చేయాలని వైస్ చైర్మన్ ప్రేంకుమార్ కోరారు. కుక్కకాటుకు గురై మృతి చెందిన గొర్లు, మేకలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మహిళా మత్స్యసహకార సంఘాలు ఏర్పాటు చేసి వారికి చేపల ప్రాసెసింగ్ శిక్షణ ఇవ్వాలని తిర్మల్‌గౌడ్ కోరారు. ఇప్పటి వరకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉన్నవారికి రైతు బంధు జమ అయ్యిందని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. సమావేశంలో సీఈవో సాయాగౌడ్, ఆయా శాఖల జిల్లా అధికారులు బావయ్య, భావన, దయానంద్, రజిత, శ్రీనివాస్‌రెడ్డి, వరదారెడ్డి, గోపాలరావు, శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు నారెడ్డి మోహన్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, మిన్కూరి రాంరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు మోయినుద్దీన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏపీడీ ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: అనారోగ్య కారణాలతో డీఆర్‌డీఏలో ఏపీడీగా పని చేస్తున్న సంజీవ్‌కుమార్(57) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై మహేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సంజీవ్‌కుమార్ కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీడీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు భార్య సింధు, కుమారుడు ఉన్నారు. సంజీవ్‌కుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. 15 రోజుల క్రితం ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఈ క్రమంలో శుక్రవారం కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆరోగ్యం బాలేదని ఇంటికి వెళ్లాడు. తిరిగి విధులకు రాకపోవడంతో సంబంధిత శాఖకు చెందిన డ్రైవర్ ఇంటికి వెళ్లి పిలవగా ఎంతకు తలుపు తీయలేదు. దీంతో డ్రైవర్ ఏపీడీ భార్యకు సమాచారం అందించాడు. ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆమె వచ్చి కిటికీలో నుంచి చూడగా సంజీవ్‌కుమార్ ఇంట్లో చున్నీతో ఉరి వేసుకొని ఉన్నాడు. తలుపులు బద్దలు కొట్టి కిందికి దించగా అప్పటికే సంజీవ్‌కుమార్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



సంజీవ్ కుమార్ (ఫైల్)

రెండేళ్ల క్రితం పదోన్నతి

జిల్లాలో ఎంపీడీవోగా సంజీవ్‌కుమార్ అందరికీ సుపరిచితులు. గతంలో అనంతపూర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆయన పనిచేశారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి, మెపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల్లో ఎంపీడీవోగా సేవలందించి రెండేళ్ల క్రితం జిల్లా ఏపీడీగా పదోన్నతి పొందారు. అందరితో కలుపుగోలుగా ఉండే సంజీవకుమార్ ఆత్మహత్యను తోటి ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు.

అడిషనల్ డీఎంహెచ్‌వోగా పద్మ

కామారెడ్డి టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అడిషనల్ డీఎంహెచ్‌వోగా డాక్టర్ పద్మ బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్‌లు రద్దు చేయడంతో హైదరాబాద్‌లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఆమె రెగ్యూలర్ స్థానమైన కామారెడ్డికి అడిషనల్ డీఎంహెచ్‌వోగా గురువారం సాయంత్రం జాయినయ్యారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఆమె శుక్రవారం సెలవు పెట్టి వెళ్లిపోయారు.

మహాసభలను సక్సెస్ చేయాలి

కామారెడ్డి టౌన్ : ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మం జిల్లాలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను సక్సెస్ చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.అనిల్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆర్కే డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వై. సత్యనారాయణ, నాయకులు తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

కామారెడ్డి క్రైం : జిల్లా కేంద్రంలోని ఓ తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన గంపల శ్రీకాంత్ ఈనెల 8వ తేదీ వ్యవసాయం నిమిత్తం బయటకు వెళ్లగా, అతడి భార్య ఉద్యోగరీత్యా నాగిరెడ్డి పేటకు తాళం వేసి వెళ్లారు. రాత్రి వీరిరువురు ఇంటికి రాలేదు. దీంతో అనుమానితులు ఇంటి తాళం పగులగొట్టి 3 తులాల బంగారం, నగదు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బాన్సువాడ రూరల్ : మండలంలోని ఇబ్రాహింపేట్ తండా జీపీ పరిధిలోని కృష్ణానగర తండా వద్ద అడవి నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం ఆ శాఖ అధికారులు పట్టుకున్నారు. బాన్సువాడలోని ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించారు.

క్రైం కార్నర్

దుర్కిలో వృద్ధురాలు మృతి



నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కిలో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లావణ్య శుక్రవారం తెలిపారు. దుర్కిలోని రైస్‌మిల్ ఎదుట ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా వృద్ధురాలి వద్ద ఆధార్‌కార్డు లభించందన్నారు. అందులో మృతురాలిని జుక్కల్‌కు చెందిన దాసరి పీరవ్వ(50)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అక్రమ నిర్మాణం సీజ్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న ఓ భవన నిర్మాణాన్ని మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం సీజ్ చేశారు. మహాలక్ష్మికాలనీలో మూడంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి తీసుకొని ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా ఐదంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించి భవనాన్ని సీజ్ చేశారు. మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు టీపీవో హరీశ్, సర్వేయర్ షికారి రాజు, ఆర్ఐ అశోక్‌సింగ్, అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్, ఎస్సై గంగాధర్ ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కంటైనర్

- స్టీరింగ్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి



భిక్కనూరు: మండల సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ జిల్లాకు చెందిన అనిల్‌కుమార్ బిందు (38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కడప నుంచి నోయిడాకు సీసీ కెమెరాల లోడ్‌తో అనిల్‌కుమార్ లారీ కంటైనర్‌లో వెళ్తుండగా భిక్కనూరు బైపాస్ సమీపంలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అనిల్‌కుమార్ స్టీరింగ్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొబైల్ షాప్‌లో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని హైటెక్ మొబైల్ షాప్‌లో విద్యుదాఘాతం సంభవించింది. శుక్రవారం ఉదయం దుకాణం నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు నిర్వాహకుడికి సమాచారం అందించారు. ఈ ఘటనలో దుకాణంలోని ఫోన్లు, కంప్యూటర్లు, సీసీ కెమెరాలు అగ్నికి ఆహుతి అయినట్లు దుకాణ నిర్వాహకుడు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

బోధన్‌టౌన్: పట్టణంలోని నర్సాపూర్ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయిల్స్‌ను గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరయ్య తెలిపారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జీవితంపై విరక్తితో ఒకరు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి–ఉప్పల్‌వాయి రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన హరీశ్‌కుమార్(33) గత పదేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

ధర్పల్లి: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మైలారంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లూరి పెద్దగంగారాం(62) ప్రతి రోజూ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. తాగిన మత్తులో ప్రతిసారి ఆత్మహత్యకు యత్నించేవాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడి తన గదిలో నిద్రించాడు. ఉదయం బయటకు రావడంతో గమనించిన కుటుంబీకులు విగత జీవిగా కనిపించాడు. తాగిన మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పక్షవాతం నయం కావడం లేదనే మనస్తాపంతో..

కమ్మర్‌పల్లి: పక్షవాతానికి గురైన ఓ వ్యక్తి నయం కావడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లికి చెందిన చిరునాంజి బాలకిషన్(54) వడ్రంగితో పాటు టింబర్ డిపో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఏడాది క్రితం పక్షవాతం రావడంతో రెండు కాళ్లు, ఎడమ చేయి సరిగా పడిచేయడం లేదు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..



శ్రీకాంత్ మృతదేహం

నస్రుల్లాబాద్: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సంగం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బదావత్ శ్రీకాంత్(25) టైల్స్ పని చేస్తు జీవిస్తుంటాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో హనుమాన్ ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొరకని గణేశ్ ఆచూకీ

- నీటి ప్రవాహం తగ్గకపోవడంతో గాలింపు చర్యలకు విఘాతం
- ఆందోళనలో కుటుంబికులు



గణేశ్ (ఫైల్)

మోర్తాడ్: కాకతీయ కాలువలో పడి గల్లంతైన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ వాసి రొయ్యల గణేశ్ ఆచూకీ ఇంకా లభించలేదు. గణేశ్ సోదరుడు గౌతం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాలువలోకి దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రక్షించబోయిన గణేశ్ గల్లంతైన విషయం విధితమే. గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకు కాలువలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. నీటి ప్రవాహాన్ని నిలపివేయాలని గ్రామ ప్రజాప్రతినిధులు, పోలీసులు నీటిపారుదల ఉన్నతాధికారులకు విన్నవించారు. నీటి ప్రవాహం తగ్గితేనే గణేశ్ ఆచూకీ లభ్యమవుతుందని గజఈతగాళ్లు పేర్కొంటున్నారు. గణేశ్‌కు గత ఏడాది వివాహం జరుగగా రెండు నెలల కుమార్తె ఉంది. నీటి విడుదలను నిలపివేయకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కాలువలో మరోసారి గాలింపు చర్యలు చేపడుతామని ఏర్గట్ల ఎస్సై మహేందర్‌రెడ్డి తెలిపారు.

సంతలో మహిళతో అసభ్య ప్రవర్తన

- కిడ్నాపర్లుగా భావించి దాడి..
- ఇటుకబట్టి కార్మికులుగా నిర్ధారించిన పోలీసులు

నవీపేట: వారాంతపు కూరగాయల సంతకు వచ్చిన మహిళతో ముగ్గురు యువకులు తాగిన మైకంలో అసభ్యంగా ప్రవర్తించారు. వారి వేషధారణలో అనుమానం వచ్చిన గ్రామస్తులు కిడ్నాపర్లుగా భావించి చితకబాదారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ముగ్గురు కార్మికులు జగదీశ్, భరత్, అశోక్ నెల రోజుల నుంచి మండలంలోని మహంతం శివారులోని ఇటుకబట్టిలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం వారాంతపు సంత కావడంతో మండల కేంద్రానికి వచ్చిన ముగ్గురు మద్యం సేవించారు. మత్తులో సంతలోకి వెళ్లి ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, చేయిని తాకారు. దీంతో ఆగ్రహించిన తోటి వినియోగదారులు, గ్రామస్తులు వారిని నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. వీరి వేషధారణ భిన్నంగా ఉండడంతో చిన్న పిల్లల కిడ్నాపర్లుగా భావించిన గ్రామస్తులు కర్రలతో చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించగా, స్థానిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఇటుకబట్టి యజమాని పూచీకత్తుపై ముగ్గురు కూలీలను విడిచి పెట్టారు.

దాడులకు పాల్పడవద్దు..

అనుమానాస్పద వ్యక్తులపై విచక్షణ రహితంగా దాడులు చేయొద్దని ఎస్సై యాదగిరిగౌడ్ కోరారు. చిన్న పిల్లల కిడ్నాపర్లు గ్రామాల్లో తిరుగుతున్నారని సోషల్ మీడియా కథనాలు రావడంతో కొత్తవారిని అనుమానిస్తున్నారని పేర్కొన్నారు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



మోపాల్: మండలంలోని కంజర్, కులాస్‌పూర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 29.62 క్వింటాళ్ల పీడీఎస్ బియాన్ని పోలీసుల సహకారంతో పౌరసరఫరాలశాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. కంజర్‌లో 18.48 క్వింటాళ్లు, కులాస్‌పూర్‌లో 11.13 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు విశ్వసనీయంగా సమాచారం రావడంతో పట్టుకున్నట్లు డీఎస్‌వో చంద్రప్రకాశ్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులను కేసుల నమోదుకు పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని సంబంధిత గ్రామాల రేషన్‌దుకాణాల్లో భద్రపర్చినట్లు డీఎస్‌వో తెలిపారు.

భిక్కనూరులో బైక్ చోరీ

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి చౌరస్తా నుంచి బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సర్దార్ దామ్మే అనే వ్యక్తి కుర్చీలు విక్రయించే వ్యాపారం చేస్తుంటాడు. నాలుగురోజుల క్రితం దామ్మెతో పాటు మరో నలుగురు అతని బంధువులు కుర్చీలు విక్రయించే వ్యాపారం మండల కేంద్రంలో చేస్తున్నారు. గురువారం రాత్రి దుండగులు బైక్‌ను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.